క్లుప్తంగా

బీటీ రోడ్డు మంజూరు


తావుర్యాతండా రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: మండలంలోని తావుర్యాతండా నుంచి కోక్యాతండా మీదుగా తడికలపూడి వరకు రూ.2.7 కోట్లతో బీటీ రోడ్డు మంజూరైంది. ఏప్రిల్ 17న సాక్షిలో ఈ రోడ్డుపై కథనం ప్రచురితం కాగా, అధికారులు స్పందించారు. బుధవారం పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, డీఈ రామకిషన్, ఏఈ అన్నె నవీన్, కోరం సురేందర్ తావుర్యాతండా – తడికలపూడి రోడ్డును పరిశీలించారు. నెల రోజుల తరువాత పనులు ప్రారంభిస్తామని ఏఈ తెలిపారు.

భూ భారతితో శాశ్వత పరిష్కారం


రెడ్డిగూడెం గ్రామంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

పాల్వంచరూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రస్తుతం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. మండలంలోని పునుకుల గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఈ నెల 20 వరకు సదస్సులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీటీ వెంకటేశ్వర్లు, ఆర్ఐ నలిన్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే, రెడ్డిగూడెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ దారా ప్రసాద్ పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

సీపీఐ మండల కమిటీ ఎన్నిక

పాల్వంచరూరల్: సీపీఐ మండల నూతన కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. మండల కమిటీ కార్యదర్శిగా రెండో సారి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సహాయ కార్యదర్శిగా గుండాల నాగరాజుతో పాటు 39 మంది కార్యవర్గ సభ్యులు, 91 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


వి.పూర్ణచందర్‌రావు


గుండాల నాగరాజు

ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫామ్స్ పంపిణీ


హెచ్‌ఎంలకు యూనిఫామ్స్ అందజేస్తున్న ఎంపీడీఓ సుభాషిని

చుంచుపల్లి: మండలంలోని 24 ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం ఎంపీడీఓ సుభాషిని చేతుల మీదుగా యూనిఫామ్స్ సంబంధిత హెచ్‌ఎంలకు అందజేశారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు పాఠ్యపుస్తకాలు, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు నోట్ పుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ, హెచ్‌ఎంలు, సెర్ప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెంచిన బస్‌పాస్ చార్జీలు తగ్గించాలి

ఇల్లెందు: పెంచిన బస్‌పాస్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఇల్లెందు బస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు ఎస్ఏ నబీ మాట్లాడుతూ.. ప్రభుత్వం 20 శాతం బస్‌పాస్ చార్జీలు పెంచుతూ నిర్ణయం తీసుకుందని, తక్షణం పెంచిన చార్జీలు విరమించుకోవాలని కోరారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి విద్యనభ్యసించాలనే విద్యార్థులకు బస్‌పాస్ చార్జీలు భారంగా మారుతాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, మోహన్‌రావు, పద్మ, వజ్జా సురేశ్, రమ, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఇంకా సమస్యలతోనే స్వాగతం

- తీరు మారని సర్కారు బడులు
- మన ఊరు – మన బడి కింద నిధులు మంజూరైనా ఫలితం శూన్యం
- కొలిక్కిరాని అభివృద్ధి, మరమ్మతు పనులు
- ఏ పాఠశాల చూసినా కనిపించేది సమస్యలే..

సర్కారు బడుల తీరు ఏమాత్రం మారలేదు. ఏ పాఠశాలలో చూసినా సమస్యలు తాండవిస్తున్నాయి. ఒకచోట తరగతి గదులు లేవు.. మరోచోట శిథిలమైన భవనాలు.. ఇంకోచోట ఉపాధ్యాయుల కొరత.. మరో పాఠశాలలో పిచ్చిమొక్కలతో కూడిన ప్రాంగణం.. వెరసి ఈ విద్యాసంవత్సరం కూడా సమస్యలతోనే పాఠశాలలు విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. మన ఊరు – మన బడి కింద నిధులు మంజూరు చేసినా ఇంకా పనులు కొలిక్కి రాలేదు. అభివృద్ధి, మరమ్మతు పనులు కొనసాగుతూనే ఉన్నాయి.. చాలాచోట్ల పాఠ్యపుస్తకాలు అందుబాటులో లేవు. ఏకరూప దుస్తులు కొన్ని చోట్ల ఇంకా తయారు కాలేదు. ఇన్ని సమస్యల నడుమ గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి..

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలో మొత్తం 49 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 17 ప్రాథమికోన్నత పాఠశాలలు, ఐదు హైస్కూళ్లు ఉండగా మొత్తం 323 మంది ఉపాధ్యాయులకు గాను 308 మంది ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. నాగారం హైస్కూల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉండగా.. 167 మంది విద్యార్థులు చదువుతున్నారు. తరగతి గదులు ఏడు ఉండగా, అందులో ఒక భవనం శిథిలావస్థకు చేరడంతో వర్షం వస్తే కురుస్తోంది. భవనంపై స్లాబ్ పెంకులు ఊడి కిందపడిపోతున్న పరిస్థితి ఉంది. ల్యాబ్‌కు, లైబ్రరీకి గదుల సౌకర్యం లేదు. స్కూల్‌కు క్రీడా మైదానాన్ని స్థానికులు అంతా కలిసి కొనుగోలు చేసినా అందుబాటులోకి తీసుకురావడం లేదు. అలాగే, తరగతి గదుల కొరతకు తోడు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థులు నిత్యం అవస్థ పడుతున్నారు. మన ఊరు – మన బడి కింద గతంలో రూ.27 లక్షలు మంజూరైనా ఇంత వరకు పనులు పూర్తి కాలేదు.

యానంబైల్ పాఠశాలలో..

యానంబైల్ హైస్కూల్‌లో 2022లో మన ఊరు – మన బడి కింద గత ప్రభుత్వం రూ.5.94 లక్షలు మంజూరు చేయగా, ప్రహరీ నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. పాఠశాల ఆవరణ గడ్డి, పిచ్చిమొక్కలతో నిండడంతో విద్యార్థులు తరగతుల్లోకి వెళ్లాలంటే ఇబ్బందికర పరిస్థితి ఉంది. ఇంగ్లిష్ మిడియంగా ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం శిథిలమవడం, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవడంతో నేలపైనే కూర్చుంటున్నారు.


బోజ్యాతండా పాఠశాలలో ఇతర సామగ్రిని నిల్వచేసిన గ్రామస్తులు

స్టోర్ రూమ్‌గా..

మండలంలో నారాయణరావుపేట, బోజ్యాతండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు గతేడాది నుంచి మూతపడ్డాయి. విద్యార్థులు లేనికారణంగా రెండు పాఠశాలలను మూసివేశారు. అయితే బోజ్యాతండాలో ఉన్న పాఠశాలలోని గదుల్లో స్థానికులు, పశువులు, మేకలను కట్టివేయడమే కాకుండా టెంట్ సామగ్రి నిల్వ చేసి స్టోర్‌రూమ్‌గా వాడుకుంటున్నారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.

రెండు పాఠశాలలు తెరుస్తాం..



మండలంలో నారాయణరావుపేట, బోజ్యాతండాలోని పాఠశాలలను ఈ విద్యాసంవత్సరం తెరుస్తాం. మన ఊరు – మన బడి కింద గతేడాది నాగారం హైస్కూల్‌కు రూ.27 లక్షలు, యానంబైల్ స్కూల్‌కు రూ.5.94 లక్షలు మంజూరయ్యాయి. అమ్మ అదర్శ కమిటీల ద్వారా 34 స్కూళ్లకు రూ.45 లక్షలు మంజూరు కాగా పనులు సాగుతున్నాయి.

–శ్రీరాంమూర్తి, ఎంఈఓ

పూర్తి కాని అదనపు గదులు

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు, పడమటనర్సాపురం, జూలూరుపాడు జిల్లా ఉన్నత పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆర్‌ఎంఎస్ఏ రూ.కోటి మంజూరు చేసింది. కానీ, ఇంకా పనులు పూర్తికాలేదు. జూలూరుపాడు హైస్కూల్‌లో రూ.30 లక్షలతో నిర్మించిన అదనపు గదులు గత ఏడాది అందుబాటులోకి రాగా, మిగిలిన పాపకొల్లు, పడమటనర్సాపురం హైస్కూల్‌లో అదనపు గదుల నిర్మాణాలు నిలిచిపోయాయి. పడమటనర్సాపురంలో భవనానికి తలుపులు, కిటికీలను అమర్చినా పెయింటింగ్, ఫ్లోరింగ్, విద్యుత్ పనులు పూర్తి కావాల్సి ఉంది. పాపకొల్లు హైస్కూల్‌లోని అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. నిర్మాణాలను పర్యవేక్షించే టీఎస్‌ఈడబ్ల్యూడీసీ ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఈ సమస్య నెలకొందనే విమర్శలు వస్తున్నాయి. ఏదిఏమైనా గురువారం నుంచి ప్రారంభమయ్యే కొత్త విద్యాసంవత్సరంలోనూ విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు.


పాపకొల్లు హైస్కూల్‌లో నిలిచిన అదనపు గదుల నిర్మాణ పనులు

సరిపడా గదులు లేక ఇబ్బంది..



6 – 10 తరగతులకు పది గదులు అవసరమైతే ఆరే గదులు ఉన్నాయి. నాలుగు అదనపు గదుల నిర్మాణం పూర్తి కాకపోగా, మన ఊరు – మన బడి కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలాయి. దీంతో వరండా, ఇతర గదుల్లో సర్దుబాటు చేయాల్సి వస్తోంది. మిగిలిన పెయింటింగ్, ఫ్లోరింగ్, విద్యుత్ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరాం.

–బానోత్ జుంకీలాల్, హెచ్‌ఎం (ఎంఈఓ)

అసౌకర్యాల నడుమ..

ఇల్లెందురూరల్: మండలంలో వివిధ యజమాన్యాల కింద మొత్తం 113 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన లక్ష్యంగా మన ఊరు.. మన బడి పేరుతో మరమ్మతు పనులు ప్రారంభించింది. ఇలా 30 పాఠశాలల్లో పనులు ప్రారంభిస్తే ఇప్పటివరకు 10 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో 60 పాఠశాలల్లో పనులు పూర్తయినట్లు చెబుతున్నా నాణ్యతాలోపం ఎదురైంది. మండలంలో ఈ విద్యాసంవత్సరం కోసం 3,764 విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులు అందించాలని విద్యాశాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. కానీ, ఇప్పటివరకు కేవలం ఒక జత ఏకరూప దుస్తులకు అవసరమైన క్లాత్ మాత్రమే మండలానికి చేరింది. కుట్టు పనులు పూర్తికాలేదు.


అధ్వానంగా సుభాష్‌నగర్ హైస్కూల్ డైనింగ్ హాల్

అలాగే, విద్యార్థులకు 20 వేల పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, 9, 10వ తరగతులకు హిందీ పాఠ్యపుస్తకం మినహా మిగతా పుస్తకాలు మండల కేంద్రానికి చేరాయి. నోట్ బుక్స్ మాత్రం హైస్కూల్ విద్యార్థులకు మాత్రమే సరఫరా చేశారు. ఈసారి వేసవిలో వర్షాలు కురవడంతో ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలు పిచ్చిమొక్కలతో అల్లుకుపోయినా శుభ్రం చేయించలేదు.

ఆపరేషన్ కగార్ రాజ్యాంగ ఉల్లంఘనే

వామపక్షాల సదస్సులో పలువురు వక్తలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మధ్య భారతంలోని అమాయక ఆదివాసీ గిరిజనులపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా యుద్ధం ప్రకటించి హత్యాకాండకు పాల్పడుతున్నారని, ఈ చర్యలను దేశ ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని వామపక్ష, విపక్ష నేతలు పిలుపునిచ్చారు. స్థానిక శేషగిరిభవన్‌లో బుధవారం వామపక్ష, విపక్షాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలుపార్టీల నేతలు సాబీర్‌పాషా, ఆవునూరి మధు, రేపాకుల శ్రీనివాస్, మల్లెల రామనాథం, జాటోత్ కృష్ణ, గౌస్‌పాషా, అనుదీప్, కురుమళ్ల శంకర్, ప్రశాంత్ మాట్లాడారు. భారత రాజ్యాంగం, ఆదివాసీ చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘించి ఆపరేషన్ కగార్ పేరుతో దుర్మార్గ చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. 2026 నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని అమిత్‌షా ప్రకటించడాన్ని దేశ ప్రజలు కోరుకోవడం లేదని, పేదరిక నిర్మూలన, పూర్తిస్థాయిలో విద్య, వైద్యం, ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పిస్తామని బాధ్యతగా కేంద్ర పాలకులు ప్రకటిస్తే ప్రజలు స్వాగతిస్తారని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో ఖనిజసంపదకు కాపలాదారులుగా ఉన్న గిరిజనులు, మావోయిస్టులను మట్టుబెట్టి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే ఆపరేషన్ కగార్‌కు కేంద్రం తెరలేపిందని ఆరోపించారు. తక్షణమే కగార్ పేరుతో జరుపుతున్న హత్యాకాండకు స్వస్తిపలికి శాంతిచర్చలకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళి, వంగా వెంకట్, భూక్య శ్రీనివాస్, రత్నకుమారి, ఫహీం, ఉమర్, కల్తీ వెంకటేశ్వర్లు, సతీశ్, గోపాల్‌రావు, దేవదానం, భూక్య రమేశ్, కృష్ణయ్య, సంజీవ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న సాబీర్‌పాషా

ఉత్సవాలను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న వెంకన్నగౌడ్

పాల్వంచ: ఈ నెల 28, 29, 30 తేదీల్లో పాకాలపాటి కృష్ణ సాంస్కృతిక కళాపీఠం, పాల్వంచ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కేటీపీఎస్ సీతారామ కల్యాణ మండపంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను విజయవంతం చేయాలని సంస్థ వ్యవస్థాపకులు పాకాలపాటి రోశయ్యచౌదరి, నిర్వాహక కమిటీ కన్వీనర్ కొండం వెంకన్నగౌడ్ కోరారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జాతీయస్థాయి నాటకోత్సవాలు, ధూంధాం, ఏకాంకిక నాటక ప్రదర్శన, భద్ర అవార్డ్స్–2025, పౌరాణిక, జానపద, చరిత్రాత్మక, సాంఘిక ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో వై.వెంకటేశ్వర్లు, కాపర్తి వెంకటాచారి, వాసుమల్ల సుందర్‌రావు, నాగేశ్వరరావు, రాము, ఎస్‌కే బాషా, నూతక్కి గాంధీ, మూడ్ లక్ష్మణ్, వానపాకుల రాంబాబు, ఎస్‌కే ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

తల్లి పేరుతో మొక్క నాటాలి


మొక్క నాటుతున్న బీజేపీ కార్యకర్తలు

కొత్తగూడెంఅర్బన్: ప్రతి ఒక్కరూ వారి తల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని లక్ష్మీదేవిపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీనాయక్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని సీతారాంపురంలో తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా బీజేపీ కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గాంధీనాయక్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు తల్లితో పాటు తాము ఒక మొక్క నాటి దేశంలో వాతావరణ సమతుల్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బాదావత్ వినోద్‌కుమార్, తారాసింగ్, లక్ష్మణ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని యాగశాలలో చండీహోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాలతో స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజ, చండీహోమం చేశారు. పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు నిలయంగా తీర్చిదిద్దాలి


ఇల్లెందురూరల్: అవగాహన కల్పిస్తున్న రమేశ్


జూలూరుపాడు: హాజరైన స్వచ్ఛ మిత్రలు


పాల్వంచ: మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీరామ్మూర్తి

ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాలలను స్వచ్ఛతకు నిలయంగా తీర్చిదిద్దాలని ఎంఈఓ ఉమాశంకర్ సూచించారు. మండలంలోని సుభాష్‌నగర్ హైస్కూల్‌లో గురువారం పాఠశాల పారిశుద్ధ్య కార్మికుల (స్వచ్ఛ మిత్రలు)కు ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం ఆయా పనుల కోసం స్వచ్ఛమిత్ర పేరుతో కార్మికులను నియమించిందని గుర్తుచేశారు. క్రమం తప్పకుండా పాఠశాల పనివేళలకు ముందే హాజరై పాఠశాల ఆవరణ, తరగతి గదులు, టాయిలెట్లను శుభ్రం చేయాలని చెప్పారు. అనంతరం పాఠశాలల్లో స్వచ్ఛమిత్ర చేయాల్సిన పనులపై ఆర్‌పీ రమేశ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌పీ నాగుల్‌స్వామి, సూర్నపాక సురేశ్, ఆనంద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడులో..

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూలూరుపాడు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛ మిత్రలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ జుంకీలాల్ మాట్లాడుతూ.. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న దృష్ట్యా తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రాంగణాలను శుభ్రం చేయాలని స్వచ్ఛ మిత్రలకు సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ దేవేందర్, స్వచ్ఛమిత్ర పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచ: పాఠశాలల్లో పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని ఎంఈఓ శ్రీరామ్మూర్తి అన్నారు. బుధవారం స్థానిక బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని స్వచ్ఛ మిత్రల (స్కావెంజర్స్)కు శిక్షణ నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలల్లో మరుగుదొడ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్‌రావు, ఆర్‌పీ శ్రీనివాస్, రమేశ్, రాంబాబు, శ్రావణి పాల్గొన్నారు.

పిల్లల పేర్లు నమోదు చేయించుకోండి..


ఇల్లెందు: వినోభానగర్‌కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ తదితరులు


టేకులపల్లి: నంద్యాతండాలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

ఇల్లెందు: పట్టణంలోని పలు వార్డుల అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. బుధవారం వినోభానగర్ కాలనీలో కార్యక్రమాన్ని సీడీపీఓ అరుణకుమారి ప్రారంభించారు. కేంద్రాల్లో పిల్లలు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రోహిణి, టీచర్ సుధారాణి తదితరు పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని ఆర్ అండ్‌ఆర్ కొత్తకాలనీ హమాలీబస్తీలో 1, 2, 3 అంగన్‌వాడీ సెంటర్లలో అమ్మ మాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూజర్‌వైజర్ రోహిణి మాట్లాడుతూ.. నాలుగేళ్లు నిండిన పిల్లలను అంనగ్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో విజయకుమారి, నాగమణి, మల్లికాంబ, సుజాత, ఆయాలు షాహీన్, సుభద్ర పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: మూడు, నాలుగేళ్ల చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సీడీపీఓ కేఎం తార కోరారు. అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం బోడు సెక్టార్‌లో టేకులపల్లి, బొమ్మనపల్లి, సులానగర్, గంగారం గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, టీచర్లు, హెల్పర్లు, వైద్య సిబ్బంది అనురాధ, యశోదమ్మ, నిర్మల, లక్ష్మి, ఖలీదాబేగం, భద్రమ్మ, సీతాకుమారి, రాధ, రమాకుమారి, వెంకటరమణ, పి.కళావతి, ఎం.కోటమ్మ, ధనమ్మ, కౌసల్య, నిర్మల, సుశీల, స్వప్న, దేవా, ధరణి, సునీత, సుజాత, మారు పాల్గొన్నారు.

రోడ్లపై పశువుల నియంత్రణేది?

- ఇప్పటికే ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు వ్యక్తులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

టేకులపల్లి: రోడ్లు, వీధుల్లో పశువుల సంచారం రోజురోజుకూ పెరిగిపోతోంది. పశువుల యజమానుల నిర్లక్ష్యం, పాలకులు, అధికారుల పట్టింపులేనితనంతో వాహనదారుల ప్రాణాలు పోతున్నాయి. అనేక మంది గాయాలపాలవుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా రోడ్లపై, రోడ్డు పక్కన గేదెలు, ఆవులు తిష్ట వేసి వాహనదారులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. పశువులు ఉన్నట్టుండి అకస్మాత్తుగా పోట్లాడుకుంటూ రోడ్లపైకి రావడంతో వాహన, పాదచారులకు తగిలి తీవ్ర గాయాలపాలవుతున్నారు. పశువులు రోడ్లపై, రోడ్డు పక్కన రోజుల తరబడి ఉంటున్న సమయంలో పోలీసులు, గ్రామ పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకుని ఉంటే ప్రమాదాలకు తావుండదు. ఇప్పటికే మే నెలలో ఇద్దరు వ్యక్తులు రోడ్లపై పశువులు అడ్డు రావడం వల్ల తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పశువులను నియంత్రించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇద్దరి మృతి..

బోడు విద్యుత్ సబ్ స్టేషన్‌లో డైలీవేజ్ కార్మికుడిగా పనిచేస్తున్న టేకులపల్లి పంచాయతీ సక్కతండాకు చెందిన భూక్య లక్ష్మణ్ (35) గత నెల 7న విధులు ముగించుకుని సాయంత్రం తన ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. సామ్యతండా వద్ద పశువులు పోట్లాడుకొని అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చి అతని బైకును ఢీకొట్టాయి. ఈ ఘటనలో లక్ష్మణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ 13న మృతి చెందాడు. ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ గ్రామానికి చెందిన బోడ భద్రు (47) బైక్‌పై గత నెల 13న చుక్కాలబోడులో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. మంగళితండా సమీపంలోకి రాగానే ఒక్కసారిగా గేదెలు రోడ్డుపైకి వచ్చి బైక్‌ను ఢీకొట్టాయి. తీవ్రంగా గాయపడిన భద్రు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 15న మృతి చెందాడు.


రోడ్డుపై రాకపోకలకు అడ్డుగా ఉన్న పశువులు


టేకులపల్లి సెంటర్‌లో రోడ్డు మధ్యలో పశువులు

ఇంకా ఎందరి ప్రాణాలు పోవాలి..?



రోడ్లపై, వీధుల్లో, రోడ్డు పక్కన ఎక్కడ పడితే అక్కడ గేదెలు, ఆవులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. వాహన, పాదచారులకు అడ్డుగా వచ్చి ఇబ్బంది పెడుతున్నాయి. ఇప్పటికే ఇద్దరు మృతి చెందారు. అనేక మంది గాయాలపాలయ్యారు. ఇంకా ఎందరి ప్రాణాలు పోవాలి.

–రేపాకుల శ్రీనివాస్, సీపీఎం నాయకుడు